క్లుప్తంగా

ఫొటోలకే పరిమితమైన చెత్త తొలగింపు



ఆస్పత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్త నిల్వలు

టెక్కలి: డివిజన్ కేంద్రమైన టెక్కలిలోని పాత ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఇటీవల అధికారులు, కూటమి నాయకులు కలిసి స్వచ్ఛ దివస్ కార్యక్రమం పేరుతో చెత్తను తొలగించారు. అయితే ఇప్పుడు ఆస్పత్రి ఆవరణ పరిశీలిస్తే స్వచ్ఛ దివస్ కార్యక్రమం కేవలం అధికారులు, నాయకుల ఫొటో షూట్‌కే పరిమితమైందనే విషయం బహిర్గతమవుతోంది. ఆస్పత్రి ఆవరణలో ఒకే చోట చెత్త నిల్వలు వేసి వదిలేశారు. దీంతో ఈ కార్యక్రమం కేవలం హడావుడి మాత్రమేనంటూ విమర్శలు చోటు చేసుకుంటున్నాయి.

శివజ్యోతుల ఊరేగింపు



శివజ్యోతులను ఊరేగిస్తున్న శివస్వాములు

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ త్రికేతేశ్వర స్వామి ఆలయంలో శివమాల దీక్షాపరులు భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం శివయ్యను ప్రత్యేక పల్లకిలో అలంకరించి శివనామ స్మరణతో ఊరేగించారు. దీక్షాపరుల కుటుంబ సభ్యులు శివ జ్యోతులతో స్వామి వారికి పూజించారు. మహాశివరాత్రి వరకు దీక్షను కొనసాగిస్తున్నట్లు స్వాములు తెలిపారు.

ఎర్రన్నకు నివాళులు



టెక్కలి: నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

టెక్కలి: టీడీపీ నాయకుడు, దివంగత కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని ఆయన ఘాట్ వద్ద కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి కె.అచ్చెన్నాయుడు, ఎంపీ కె.అప్పలనాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో పాటు ఎర్రన్నాయుడు కుటుంబ సభ్యులు, నాయకులు నివాళులర్పించారు. సంతబొమ్మాళి మండలంలో కూడా ఎర్రన్న జయంతిని నిర్వహించారు.

రూ. 10 వేల సాయం అందజేత



సాయం అందజేస్తున్న దృశ్యం

కవిటి: కొండిపుట్టుగ గ్రామానికి బైరెడ్ల మాధవ్ బతుకుతెరువు కోసం విదేశాలకు వెళ్లి అనారోగ్యం పాలయ్యాడు. అలాగే అతని తల్లి కూడా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ ప్రతినిధులు రూ. పది వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని గొండ్యాలపుట్టుగ గ్రామపెద్దలు పొందూరు బాలకృష్ణ, దుద్ది ధర్మారావు ద్వారా బాధిత కుటుంబానికి ఆదివారం అందజేశారు.

కళాకారుడి ప్రతిభ



బహుమతులు పొందిన బల్లెడ చలం

కవిటి: విజయనగరం జిల్లా నెల్లిమర్ల పంచాయతీ జరజాపుపేటలో ఈ నెల 20 నుంచి 22వ తేదీ వరకు జరిగిన ఆంధ్రా–తెలంగాణా రాష్ట్రాల నాటిక పరిషత్ పోటీల్లో బొరివంక శార్వాణీ గిరిజన సాంస్కృతిక సమాఖ్య ప్రదర్శించిన కొత్తపరిమళం నాటిక శ్రోతలను అలరించింది. విలన్ పాత్రధారిగా నటించిన బల్లెడ చలం ఉత్తమ కళాకారుడు అవార్డుకు ఎంపికై నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందుకున్నారు.

బెంకిలిలో పల్లకీసేవ



పల్లకీ సేవలో భక్తులు

సోంపేట: ప్రతిఒక్కరికీ ఆధ్యాత్మిక మార్గం అవసరమని సోంపేట సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బెంకిలి గ్రామంలో పల్లకీ సేవ నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. సాయి భక్తులు, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

అకాల వర్షంతో రైతులు ఆందోళన

వజ్రపుకొత్తూరు రూరల్: వాతావరణంలో సంభవించిన మార్పుల ప్రభావంతో రెండు రోజులుగా మండలంలో కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన మినుము, పెసర, ఇతర అపరాల పంటలు చేతికి అందుతున్న తరుణంలో కురుస్తున్న వర్షంతో నష్టపోతామని రైతులు చెబుతున్నారు. శనివారం అర్ధరాత్రి, ఆదివారం ఉదయం కూడా వర్షం కురిసింది.

పడకేసిన పాలన!



సంతబొమ్మాళి ఎంపీడీవో కార్యాలయం

- ఇన్‌చార్జి కార్యదర్శులే దిక్కు
- 34 పంచాయతీలకు 20 మందే విధుల్లో.. అందులో ముగ్గురు దీర్ఘకాలిక సెలవు

సంతబొమ్మాళి: పల్లెలే దేశ ప్రగతికిపట్టుకొమ్మలంటారు. కానీ కూటమి ప్రభుత్వం దీనికి తూట్లు పొడుస్తోంది. గ్రామాల్లో స్వపరిపాలన కానరాకుండా చేస్తోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇళ్ల వద్దకే సంక్షేమం చేరువకాగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో కార్యదర్శులు లేకుండా పోవడంతో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇలాకాలో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. క్షేత్ర స్థాయిలో అధికారులు లేకపోవడంతో పాలన కుంటుపడుతున్నది. సంతబొమ్మాళి మండలంలో 34 పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 20 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలో దండుగోపాలపురం, ఉమిలాడ, జగన్నాథపురం పంచాయతీ కార్యదర్శులు ప్రసూతి సెలవుల్లో ఉన్నారు. ఒక్కో కార్యదర్శి రెండు, మూడు పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తుండడంతో సిబ్బందితో పాటు ప్రజలు కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణ కష్టతరంగా మారింది. ఇతర పనుల్లో జాప్యం నెలకుంటోంది. ఇన్‌చార్జి కార్యదర్శులు తన సొంత పంచాయతీతోపాటు ఇన్‌చార్జిగా ఉన్న గ్రామానికి కూడా న్యాయం చేయలేకపోతున్నారు. ప్రజలకు కూడా అందుబాటులో ఉండలేని పరిస్థితి ఉంది. మండలంలో ఎక్కువ జనాభా కలిగిన సంతబొమ్మాళి, నౌపడ పంచాయతీలకు ఇన్‌చార్జిలుగా దుంప శ్రీనివాసరావు, ఉప్పాడ ఉమాపతిలు వ్యవహరిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి అన్ని పంచాయతీలకు కార్యదర్శులను ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సేవల్లో జాప్యం



పూర్తిస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు లేకపోవడంతో సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త సంపద నిర్వహణ సవాల్‌గా మారింది. ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పంచాయతీ కార్యదర్శులను నియమించాలి.
– వాదాల దుర్గారావు, సంతబొమ్మాళి

రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి



నౌపడ లాంటి పెద్ద గ్రామానికి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడం దారుణం. ఇన్‌చార్జి పాలనలో జాప్యం జరుగుతుంది. ప్రజలకు అవసరమయ్యే సమయంలో ఇన్‌చార్జి కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి రెగ్యులర్ కార్యదర్శిని నియమించాలి. – ఎల్. శ్రీనివాసరావు, నౌపడ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



పంచాయతీ కార్యదర్శుల కొరత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గ్రామాల్లో ఎటువంటి సమస్య లేకుండా తమ వంతుగా కృషి చేస్తున్నాం.
– జయంతి ప్రసాద్, ఎంపీడీవో, సంతబొమ్మాళి

మంత్రి చెప్పిన భయం పోలేదు!



కొనుగోలుదారుల్లేక ఖాళీగా ఉన్న చికెన్ సెంటర్



జనాలతో కిటకిటలాడుతున్న చేపల మార్కెట్

- వెలవెల బోయిన చికెన్ సెంటర్లు

టెక్కలి రూరల్: బర్డ్‌ఫ్లూతో కోళ్లు చనిపోతున్నట్టు జరుగుతున్న ప్రచారంతో చికెన్ తినేందుకు ప్రజలు భయపడుతున్నారు. చికెన్ తింటే తమ ప్రాణాలకు హాని కలుగుతుందనే భయంతో దానికి దూరంగా ఉంటున్నారు. సాక్షాత్తు రాష్ట్ర పశుసంవర్ధక శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చికెన్ తినడం వలన ఎటువంటి ఇబ్బందుల్లేవని.. ఎవరైన వండి పెడితే నేను కూడా తింటానని చెబుతూ చికెన్ మేళాలు ఏర్పాటు చేస్తున్నప్పటికీ ప్రజల్లో మాత్రం భయం పోవడం లేదు. ఆదివారం టెక్కలి మార్కెట్‌లో ప్రజలు చికెన్ కంటే చేపలు, మటన్ కొనుగోలకే ఆసక్తి చూపారు. దీంతో చికెన్ విక్రయ దుకాణాలు వెలవెలబోగా మటన్, చేపల దుకాణాలు రద్దీగా కనిపించాయి.



మార్కెట్‌లో చేపలు చేయడంలో బిజీగా ఉన్న మహిళలు

ఇదేనా ఎన్నికల కోడ్ అమలు?

ఇచ్ఛాపురం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో మున్సిపల్ అధికారులు సరైన చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పురపాలకసంఘం పరిధి రత్తకన్న రోడ్డులోని ఎల్‌సీగేట్ వద్ద స్థానిక కూటమి నాయకులు స్థానిక ఎమ్మెల్యేకి అభినందనలు తెలిపే ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. కోడ్ అమలు నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని ప్రధానమార్గాల్లో ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం, ఆయా ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకుల అభిమానుల ఇళ్లు, షాపుల వద్ద, పలు కూడళ్లలో ఏర్పాటు చేసి వాటిని మాత్రం తొలగించలేదు.



ఎల్‌సీ గేట్ వద్ద దర్శనమిస్తున్న టీడీపీ నాయకుల ఫ్లెక్సీలు

మంచినీటి పథకం చుట్టూ క్షీణించిన పారిశుద్ధ్యం



నీటి పథకం చుట్టూ చేరిన మురుగునీరు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి పాలకేంద్రం వెనుక భాగంలోని కొత్తమ్మతల్లి వీధిలో మినీ మంచినీటి పథకం చుట్టూ పారిశుద్ధ్యం క్షీణించింది. స్థానికులు కొంతమంది తమ ఇళ్లల్లో వినియోగిస్తున్న వాడుక నీటిని మంచినీటి పథకం వైపు మళ్లించారు. దీంతో మురుగునీరు అక్కడ నిలిచిపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. పంచాయతీ యంత్రాంగం స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

సారా విక్రయిస్తే చర్యలు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో మద్యం, నాటు సారా అమ్మకాలు జరిపే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ పీ.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. సన్యాసిపుట్టుగ గ్రామంలో స్థానికులతో ఆదివారం సమావేశమై మద్యం, సారా, గంజాయి వంటి మత్తుపదార్థాలు వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో కల్తీ మద్యం, నాటుసారా, గంజాయి విక్రయాలు జరిపితే టోల్‌ఫ్రీ నంబర్ 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి నెలలో ఇప్పటి వరకు 16 ఎక్సైజ్ కేసులు నమోదు చేశామన్నారు. సమావేశంలో సర్పంచ్ గుజ్జు ఢిల్లీరావు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ దుర్గాప్రసాద్

రోడ్లపై పశువులతో ఇక్కట్లు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలో రోడ్లపైనే పశువులు తిష్ట వేస్తున్నాయి. విచ్చలవిడిగా పశువులు సంచరిస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తప్పించేక్రమంలో ప్రమాదాలకు గురువుతున్నారు. పశువులు రోడ్లపై తిరిగితే వాటిని పట్టుకొని సింహాచలం గోశాలకు తరలిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ గతంలో హెచ్చరికలు చేసినప్పటికీ అమలులో మాత్రం అది సాధ్యం కాలేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టి రోడ్లపై పశువులు సంచరించకుండా చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.



రోడ్డు డివైడర్‌పై ఉన్న పశువులు

ఎన్‌ఏటీఎస్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

కాశీబుగ్గ: నేషనల్ అప్రెంటీస్ షిప్ శిక్షణ (ఎన్‌ఏటీఎస్) పొందేందుకు దరఖాస్తు కోరుతున్నట్లు పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 25 ఏళ్లలోపు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఏడాదిపాటు శిక్షణ ఉంటుందని..నెలకు రూ.4,500 గౌరవభృతి అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కంచిలి: మఠం సరియాపల్లి గ్రామంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతిలో చేరేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆన్‌లైన్‌లో ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 20వ తేదీన ఉదయం పది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షను మోడల్ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత అయిన వారికి ఆరో తరగతిలో ప్రవేశం ఉంటుందని, మార్కులు ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. మరిన్ని వివరాల కోసం 99859 75684, 83744 33269, 94918 04092 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సోంపేట: సోంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చిన్నాజీవర్మ తెలిపారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు 75 రూపాయలు ఫీజుగా చెల్లించాలన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి

సోంపేట: నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషిచేస్తామని పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు పొదుగు కామేష్, వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడు కోళ్లనారాయణ, వలంటీర్ల విభాగం అధ్యక్షుడు బతకల సతీష్, పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు అమరలోకనాథం అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పగించిన బాధ్యతలకు న్యాయం చేస్తానన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న తిలక్, నాయకులు

టెక్కలి: తలగాం గ్రామంలోని విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యస్వామి, పార్వతీదేవి, నవగ్రహాల ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం వైభవంగా జరిజగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, ఆలయ కమిటీ ప్రతినిధులు హెచ్.వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పి.రమేష్, నాయకులు సత్తారు సత్యం, పలు పంచాయతీల సర్పంచ్‌లు పోలాకి మోహన్, సర్లాన బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖర్, ఆర్.ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందనలు

టెక్కలి: చదరంగం క్రీడాకారిణి బొల్ల శృతిని కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి ఆదివారం అభినందించారు. మహారాష్ట్రంలోని నాందేడ్‌లో జరిగిన జాతీయ స్థాయి చదరంగం పోటీల్లో జిల్లాకు చెందిన శృతి ఆంధ్రప్రదేశ్ తరపున స్టాండ్‌బైగా ఎంపికై గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో కోచ్ ఎస్.భీమారావు ఆధ్వర్యంలో కృపారాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం క్రీడాకారిణి శృతికి దుశ్శాలువతో సత్కరించారు.



చదరంగం క్రీడాకారిణి శృతిని అభినందిస్తున్న కృపారాణి

హైవేపై ఇసుక మేటలు..



కవిటి మండలంలోని జాడుపుడి ఆర్‌ఎస్ నుంచి కొజ్జీరియా జంక్షన్ వరకు ఉన్న 16వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఎక్కడికక్కడ రోడ్డుపైనే ఇసుక పేరుకు పోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక మేటలను తొలగించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – కవిటి

దారిలేకుండా చేస్తున్నారు..



పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ కోసంగిపురం జాతీయ రహదారి ఫ్లైఓవర్ వంతెన కింద రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. ట్రావెల్ బస్సులు, ఇసుక లారీలు, ఇతర వాహనాలను అనధికార బ్రిడ్జి దిగువనే ఇష్టం వచ్చినట్టు పార్కింగ్ చేస్తున్నారు. అధికారులు, పోలీసులు, హైవే అథారిటీవారు స్పందించి పగలు రాత్రి తేడా లేకుండా పర్మినెంట్ పార్కింగ్‌లా వాడుకుంటున్న వారిపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – కాశీబుగ్గ

రైతు వినూత్న ఆలోచన



రైతులు ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలను పక్షులు, అడవిపందులు నాశనం చేస్తున్నాయి. వీటి బారినుంచి పంటలను కాపాడుకోవడానికి రైతులు వినూత్న ఆలోచన చేస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి, సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు, నగరంపల్లి, తాడివాడ, కిడిసింగి తదితర గ్రామాల్లో రైతులు పెసర, వినుము, వేరుశనగ, రాగులు, మిరప, పలు రకాల కూరగాయలను సాగు చేస్తున్నారు. వీటిని కాపాడుకోవడానికి మనుషులు కేకలు వేస్తున్నట్టు రికార్డు చేసి లౌడ్ స్పీకర్లను పంట పొలాల్లో ఏర్పాటు చేస్తున్నారు. వీటిని ఆన్‌చేసి ఉంచుతుండడంతో పక్షులు, జంతువులు రావడం లేదని చెబుతున్నారు. – వజ్రపుకొత్తూరు రూరల్

బాహుదాలో ఇసుక అక్రమ రవాణా!

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మండలంలోని బాహుదానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ కొంతమంది బరితెగించి ఇసుకను తవ్వేసి దూర ప్రాంతాలకు వాహనాల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలనే ఉద్దేశంతో వాహనాలు వెళ్లకుండా నదికి వెళ్లే మార్గంలో తహసీల్దార్ వెంకటరావు పెద్దగోతులను తవ్వించారు. అయితే అక్రమార్కులు వాటిని పూడ్చివేసి నది నుంచి ఇసుకను తరలించుకుపోతున్నారు.



నది నుంచి తీసుకొచ్చి నిల్వ చేసిన ఇసుక దిబ్బలు

వాసుదేవుని సేవలో మాజీ మంత్రి అప్పలరాజు



స్వామివారి రథాన్ని లాగుతున్న మాజీ మంత్రి అప్పలరాజు తదితరులు

మందస పట్టణంలో వారం రోజులుగా జరుగుతున్న వాసుదేవుని బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజున మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రథాన్ని లాగారు. – కాశీబుగ్గ

వైభవంగా సింహద్వార ప్రతిష్ట

కవిటి: సీహెచ్ కపాసుకుద్ది గ్రామదేవత తోటమ్మ తల్లి అమ్మవారి ఆలయానికి నూతనంగా నిర్మించిన సింహద్వారాన్ని ఆదివారం వైభవంగా ప్రతిష్ఠించారు. గ్రామ పురోహితుడు నారాయణపాఢి నేతృత్వంలో ఒడిశాకు చెందిన పది మంది పురోహితుల ఆధ్వర్యంలో ముందుగా అమ్మవారికి లోకకల్యాణార్థం హోమాన్ని నిర్వహించారు. అనంతరం విశేష అభిషేకాలు చేపట్టారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సర్పంచ్ కె.దమయంతి పాల్గొన్నారు.



సింహద్వార ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తజనం